అగ్రనేత
తెలుగు దిన పత్రిక
TELTEL/2015/66279
రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :160 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శనివారం 30-08-2025 పేజీలు:4 వెల: 2.00

## మెదక్ లో వరదలలో కొట్టుకపోయిన రైల్వే లైన్...

హైదరాబాద్: ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరదలు పోటెత్తడంతో కామారెడ్డి, నిజామాబాద్, మెదక్ జిల్లాలు అతలాకుతలమయ్యాయి. మెదక్ జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో వరదలలో రైల్వేలైన్ కొట్టుకుపోయింది. శమ్నాపూర్ రైల్వే బ్రిడ్జి కింది భాగంలో భారీగా వరద నీరు చేరుకోవడంతో రైల్వే లైన్ కింద భాగం కొట్టుకపోయింది. శేఖర్ అనే రైతు రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చాడు. సికింద్రాబాద్ %-% నిజామాబాద్, అక్కన్నపేట %-% మెదక్ మార్గంలో రైళ్ల రాకపోకలను రైల్వే అధికారులు నిలిపివేశారు. ఏడుపాయల దేవాలయం వరదలలో పూర్తిగా మునిగిపోయింది.. వరదనీరు దేవాలయం పైవరకు చేరుకుంది. వరద ఉధృతి ఎక్కువగా ఉండటంతో దేవాలయం వైపు భక్తులు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. నిజామాబాద్ టూ హైదరాబాద్ జాతీయ రహదారిపై వెళ్లే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు నిర్మల్‌లో కొండాపూర్ మీదుగా వెళ్లాలని సూచస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి 44పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడడంతో 20 కిలోమీటర్ల

# భారత్‌లో చేయండి..ప్రపంచం కోసం చేయండి..



టోక్యో ప్రపంచంలోనే భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతుందని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. రెండు రోజుల జపాన్ పర్యటనలో భాగంగా గురువారం టోక్యో చేరుకున్నారు. అనంతరం ఇండియా-జపాన్ జాయింట్ ఎకనామిక్ ఫోరంలో మోదీ ప్రసంగించారు. "కమ్ మేక్ ఇన్ ఇండియా.. మేక్ ఫర్ ది వరల్డ్" అనే ఆహ్వానాన్ని వ్యాపార వేత్తలకు అందించారు. భారతదేశంలో తయారు చేయండి.. ప్రపంచం కోసం తయారు చేయాలని వ్యాపార నాయకులను కోరారు. రెండు దేశాల ఆర్థిక భాగస్వామ్యం మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జపాన్ కంపెనీలు భారత్‌లో 40 బిలియన్‌కు పైగా పెట్టుబడులు పెట్టాయని చెప్పారు. ఇది బలమైన ద్వైపాక్షిక సంబంధాలకు విశ్వాసాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. సాంకేతిక, మౌలిక సదుపాయాలు, తయారీ వంటి కీలక రంగాలకు సామర్థ్యాన్ని పెంచుకుందని పేర్కొన్నారు. శుక్ర, శనివారాల్లో జపాన్‌లో మోదీ పర్యటన కొనసాగనుంది. ఇక జపాన్ ప్రధాని షిగేరు ఇషిబాతో శిఖరాగ్ర చర్చలు జరపనున్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడనున్నాయి. క్వాడ్, ఏఐ, సెమీ-కండక్టర్లు.. మొదలగు అంశాలపై మోదీ చర్చలు జరపనున్నారు. ఇక ఆగస్టు 30న మోదీ-ఇషిబా మియాగి ప్రిఫెక్చర్‌కు వెళ్లనున్నారు. అక్కడ సెండాయ్‌లోని తోహొకు షింకన్‌సెన్ ప్లాంట్‌ను పరిశీలించనున్నట్లు జపాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ముంబై-అహ్మదాబాద్ హై స్పీడ్ రైలు 'బుల్లెట్ ట్రైన్' ప్రాజెక్ట్ కోసం 2030లో ఇండియాకు తరలించనున్న E-10 కోచ్‌లను పరిశీలించనున్నారు. అనంతరం ఒక ఒప్పందంపై సంతకం చేయనున్నట్లు తెలుస్తోంది. ఆర్థిక భద్రత, సెమీకండక్టర్ టెక్నాలజీ సహకారం, కృత్రిమ మేధస్సుతో సహా అనేక పత్రాలపై ఇరుపక్షాలు సంతకాలు చేయనున్నారు. అలాగే అంతరిక్ష, రక్షణ సహకారాలపై కూడా ఇరువురు చర్చించనున్నారు. జపాన్ పర్యటన ముగింపుకుని ఆగస్టు 31న మోడీ చైనాకు చేరుకుంటారు. టియాంజిన్‌లో జరిగే ఎస్‌సీవో సమ్మిట్‌లో పాల్గొననున్నారు. శిఖరాగ్ర సమావేశంలో భాగంగా చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లతో మోదీ సమావేశం కానున్నారు. సరిహద్దులో ఏర్పడిన ఉద్రిక్తతల కారణంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. దాదాపు ఏడేళ్ల తర్వాత మోడీ చైనాకు వెళ్తున్నారు. చైనాలో జరిగే సమ్మిట్‌కు 11 దేశాల నేతలను చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆహ్వానించారు. ఇక ఇందులో ప్రధానంగా రష్యా అధ్యక్షుడు పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ఉన్నారు. ఈ సమ్మిట్‌కు ఎస్‌సీవో దేశాలతో పాటు నేపాల్, మాల్దీవులు, తుర్కియే, ఈజిప్ట్, ఇండోనేషియా, మలేషియా, వియత్నాం, కంబోడియా, మంగోలియా, తుర్క్‌మెనిస్తాన్, లావోస్, అర్మేనియా, అజర్‌బైజాన్ నాయకులంతా సమావేశానికి హాజరవుతున్నట్లు తెలుస్తోంది. చైనాలో టూర్‌లో భాగంగా తొలిసారి జిన్‌పింగ్‌తో మోడీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

# స్కాలర్‌షిప్ బకాయిలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం...



హైదరాబాద్ : స్కాలర్‌షిప్ బకాయిలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిజాం కాలేజీ విద్యార్థిని సుమన ఎక్స్ వేదికగా కేటీఆర్‌కు అభ్యర్థన చేయగా.. ఆయన స్పందించారు.

ఈ అంశాన్ని తన దృష్టికి తీసుకొచ్చినందుకు థ్యాంక్యూ చెప్పారు కేటీఆర్. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో మీరు అత్యంత చురుకైన నాయకులలో ఒకరు. నిజాం కళాశాల పూర్వ విద్యార్థిగా, మీరు ఎక్స్ వేదికగా మా సమస్యలను ముందుగానే పరిష్కరించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మేము మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము అని సుమన అనే విద్యార్థిని ట్వీట్ చేశారు. ఇటీవలే నేను నిజాం కాలేజీ నుంచి డిగ్రీ పూర్తి చేశాను. టీసీ తీసుకునేందుకు వెళ్తే.. ఆర్టీఎఫ్ రూ. 28 వేలు, ఎంటీఎఫ్ రూ. 14 వేలు చెల్లించాలని అడిగారు. ఇప్పటి వరకు తమకు ఫైనల్ ఇయర్ స్కాలర్‌షిప్ చెల్లించలేదు. మాది మధ్య తరగతి కుటుంబం.. దయచేసి తక్షణమే స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని కోరుతున్నట్లు సుమన్ ప్రభుత్వాన్ని కోరారు.

# పాట్నాలో తీవ్ర ఉద్రిక్తత.. కర్రలు, రాళ్లతో కొట్టుకున్న కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు



పాట్నా:బీహార్‌లో ఎన్నికల షెడ్యూల్ రాకముందే రాజకీయాలు హీటెక్కుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఇక ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అగ్ర నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బీహార్ ఓటర్ అధికార్ యాత్ర చేపట్టారు. ఆగస్టు 17న ప్రారంభమైన ఈ యాత్ర సెప్టెంబర్ 1న ముగియనుంది. ఈ యాత్రలో భాగంగా దుర్భంగా పట్టణంలో నిర్వహించిన సభలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు మోదీ, ఆయన తల్లిని దూషిస్తూ వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ ఆరోపించింది. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఇప్పటికే ఈ వ్యాఖ్యలను బీజేపీ, మిత్రపక్షాలు ఖండించాయి. నితీష్ కుమార్, అమిత్ షా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా తీవ్రంగా ఖండించారు. తాజాగా పాట్నాలో బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఇరు వర్గాలు కర్రలు, రాళ్లతో కొట్టుకుని బీభత్సం సృష్టించారు. తలలు పగిలేలా రెండు పార్టీల కార్యకర్తలు కొట్టుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. కాంగ్రెస్ కార్యాలయంపై బీజేపీ కార్యకర్తలు రాళ్లు విసిరి దాడి చేశారు. ఇక మోదీ, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ కార్యకర్తపై బీజేపీ ఫిర్యాదు చేసింది. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మోడీని హిందీలో దూషిస్తున్నట్టుగా వీడియోలు దర్శనమిచ్చాయి. ఇక నిందితుడు సింగ్వారాలోని భాపుర గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి అరెస్ట్ చేశారు. ఇదిలా ఉంటే బీజేపీ ఆరోపణలపై కాంగ్రెస్ ఇప్పటివరకు స్పందించలేదు.

# అసెంబ్లీలో ప్రభుత్వం బట్టలు విప్పేందుకు సిద్ధంగా ఉన్నాం



హైదరాబాద్ : ప్రజా సమస్యలపై అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం బట్టలు విప్పేందుకు సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద స్పష్టం చేశారు. అసెంబ్లీలో ఎలాంటి చర్చకైనా బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని ఆయన తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఆవరణలోని మీడియా పాయింట్‌లో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడారు. ఉత్తర తెలంగాణ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. సీఎం రేవంత్ రెడ్డి బురద రాజకీయం చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీపైన బురదచల్లడానికి రేవంత్ రెడ్డి అసెంబ్లీని రాజకీయ వేదికగా వాడుకుంటున్నారు. అకాల వర్షాలు, వరదలతో పెద్ద ఎత్తున నష్టం జరిగింది. ప్రజలను, రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టేందుకు పీసీ ఘోష్ కమిషన్‌ను రేవంత్ రెడ్డి అడ్డం పెట్టుకున్నారు. రాష్ట్రంలో వరదలు వస్తే సీఎం బీహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. తెలంగాణ హెలికాప్టర్‌ను రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారానికి రేవంత్ రెడ్డి పంపించారు. రేవంత్ రెడ్డికి అధిష్టానం మాత్రమే ముఖ్యం, ప్రజలు ముఖ్యం కాదు. అసెంబ్లీ సమావేశాలతో ప్రభుత్వం సాధించేది ఏంటి..? అని వివేకానంద నిలదీశారు. ఏరియల్ వ్యూను సీఎం రేవంత్ రెడ్డి రాజకీయాలకు వాడుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి వింతగా ఉంది. వరదలకు రేవంత్ రెడ్డి హారతి పడుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించడానికి వెళ్లిన రేవంత్ రెడ్డి.. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావుపై బురదజల్లే ప్రయత్నం చేశారు. ఓయూ పర్యటనలోను కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి బురదచల్లారు. అసెంబ్లీలో ఎలాంటి చర్చకు అయినా బీఆర్ఎస్ సిద్ధంగా ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యుత్ అంశంలో కమిషన్ వేసి తోకముడుచుకుంది. ఫార్ములా ఈ కార్ రేస్‌పై అసెంబ్లీలో చర్చ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తే ప్రభుత్వం పారిపోయింది. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మైక్ కట్ చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేల మైక్ కట్ చేయకుండా అవకాశం ఇవ్వాలి. అసెంబ్లీలో ప్రభుత్వం బట్టలు విప్పేందుకు బిఆర్ఎస్ సిద్ధంగా ఉంది. యూరియాతో రైతులు, వరదలతో ప్రజలు రోడ్డు మీద ఉన్నారు. ప్రభుత్వం బిఆర్ఎస్ పార్టీపై ఎన్ని కుట్రలు చేసినా ఎదుర్కొంటాం. ప్రభుత్వానికి కోర్టుల్లో చివాట్లు ఎదురవుతున్నాయి అని వివేకానంద తెలిపారు.

# అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తా.. జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు



వాషింగ్టన్:అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో ఏదైనా ఊహించని పరిస్థితి తలెత్తితే తాను అధ్యక్ష బాధ్యతలు స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానంటూ సంచలన కామెంట్స్ చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై ఊహాగానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వాన్స్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. యూఎస్ఏ టుడేతో మాట్లాడిన జేడీ వాన్స్.. ట్రంప్ ఆరోగ్యంపై మాట్లాడారు. 'అధ్యక్షుడు ట్రంప్ ఆరోగ్యంపై ఇటీవలే వచ్చిన కథనాలు అమెరికా ప్రజల్లో ఆందోళన రేకెత్తించాయి. అందులో వాస్తవం లేదు. ట్రంప్ ప్రస్తుతం ఆరోగ్యంగా, చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఆయన ఆరోగ్యం విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొన్నిసార్లు భయంకరమైన విషాదాలు చోటు చేసుకుంటున్నాయి. కానీ, వాటన్నింటినీ దాటుకొని తన పదవీ కాలాన్ని ట్రంప్ పూర్తి చేస్తారని ఆశిస్తున్నా. అమెరికా ప్రజలకు ఇంకా గొప్ప పనులు చేస్తారన్న నమ్మకం నాకు ఉంది. ఒకవేళ ఏదైనా ఊహించని పరిస్థితి తలెత్తితే అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను'అంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జేడీ వాన్స్ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

అధ్యక్షుడి ఆరోగ్యంపై ఊహాగానాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై ఇటీవలే పలు ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఆయన చేతులపై కమిలిన గాయాలు కనిపించడం ఇటీవలే కలకలం రేపుతోంది. ట్రంప్ కుడిచేతి వెనుక భాగంలో ఓ తెల్లటి మార్క్ కనిపించింది. సోమవారం ఓవెల్ ఆఫీస్ లో జరిగిన సమావేశం సందర్భంగా అది కెమెరాకు చిక్కింది. దీంతో ట్రంప్ ఆరోగ్యంపై ఆందోళన రేకెత్తించింది. ఇది చూసిన ట్రంప్ మద్దతుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్ వింత వ్యాధితో బాధపడుతున్నారంటూ వదంతులు వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఇటీవలే ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మానుయెల్ మాక్రాన్‌తో భేటీ సందర్భంగా ట్రంప్ చేతిపై కమిలిన గాయాలు కనిపించాయి. ఆ తర్వాత న్యూజెర్సీలో జరిగిన ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ తిలకించేందుకు వచ్చిన ట్రంప్ కాస్త అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కనిపించారు. కాళ్ల వద్ద నరాలు ఉబ్బిపోయినట్లుగా, కుడి చేతిపై పలు చోట్ల వాపు ఉన్నట్లు కెమెరా కంట పడింది. ఇప్పుడు మరోసారి ట్రంప్ కుడి అరచేతి వెనుక భాగంలో ఇలాంటి గాయాలే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఆ కమిలిన గాయాన్ని దాచేందుకు అధ్యక్షుడు మేకప్‌తో కవర్ చేసినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన దృష్యాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# ఆదివాసీలు దళితులు అర్హులు కారా...రాహుల్ సంధించిన సూటి ప్రశ్న !



న్యూఢిల్లీ,భారత దేశంలో ఆదివాసీలు దళితుల పరిస్థితులు అందరికీ తెలిసిందే. స్వాతంత్రం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడుస్తున్నా కూడా ఇంకా వారి జీవితాలకు అసలైన ఉదయం రాలేదని అంతా అంటారు. దానికి పాలకుల వైపు నుంచి ఉదాశీనత ఒక కారణం అని వినిపిస్తూ ఉంటుంది. అదే సమయంలో వారి కోసం ఎన్ని చట్టాలు చేసినా కూడా అమలులో లోపాలా లేక వారు అందుకోవడంలో అవరోధాలా అన్నది తెలియదు కానీ ఇంకా అత్యధిక శాతం మంది అలాగే పేదరికంలోనే ఉంటున్నారు. కొన్ని అత్యున్నత అందలాలు వారికి ఇంకా దక్కడం లేదు అన్నది కళ్ళకు కట్టిన దృశ్యం.

ఎంత మంది సీఈవోలుగా ఉన్నారు :

దేశంలో అయిదారు వందల పెద్ద కంపెనీలు ఉన్నాయనుకుంటే అందులో ఎంతమంది దళితులు ఆదివాసులు సీఈవోలుగా ఉన్నారు అన్న ప్రశ్నను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సంధించారు. ఆయన బీహార్ రాష్ట్ర పర్యటనలో చాలా విషయాల మీద మాట్లాడుతున్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న బడుగులు దళితులు ఇంకా అలాగే ఉన్నారు అన్నది ఆయన తాజాగా వ్యక్తం చేసిన ఆవేదనగా కనిపిస్తోంది. దేశంలో ఎన్నో ఆసుపత్రులు ఉన్నాయని కానీ దళితులు ఆదివాసుల చేతులలో ఎన్ని ఉన్నాయని కూడా ఆయన ప్రశ్నించారు ఎంతసేపూ వారు తమకు వచ్చిన జబ్బులని నయం చేసుకునేందుకు ఆసుపత్రుల వెంట తిరుగుతూ లక్షలలో బిల్లులు కట్టడమేనా అని కూడా ఆయన అన్నారు. అంత డబ్బు వారి వద్ద ఉంటుందా అని కూడా రాహుల్ ప్రశ్నించారు.

ఓబీసీల నుంచి దళితుల దాకా :

రాహుల్ గత కొన్నాళ్ళుగా ఓబీసీల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నారు కుల గణన చేయాలని ఆయన చాలా కాలంగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఆ విధంగా చేయడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది అంటే ఒక విధంగా అది రాహుల్ గాంధీ సాధించిన విజయం అని కాంగ్రెస్ వర్గాలు గొప్పగా చెబుతూ వస్తున్నాయి ఇపుడు కాంగ్రెస్ కి సంప్రదాయ ఓటు బ్యాంక్ గా ఉన్న దళితులు ఆదీవాసుల గురించి రాహుల్ మాట్లాడుతున్నారు వారి జీవితాల్లో ఎలాంటి మార్పు లేదని ఆయన విమర్శిస్తున్నారు. దేశం ఆర్థికంగా ఎంతో అభివృద్ధి సాధిస్తున్న ప్రస్తుత తరుణంలో కూడా దళితులు ఆదీవాసులు అలాగే మిగిలిపోవడం కంటే ఆవేదన ఏమి ఉంటుందని అంటున్నారు.

మరింత దగ్గరగా :

ఇదిలా ఉంటే దళితులు ఆదీవాసులకు మరింత దగ్గర అయ్యేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోంది ఒకనాడు ఈ వర్గాలు అన్నీ కాంగ్రెస్ కి ఎంతో వెన్నుదన్నుగా ఉంటూ వచ్చేవి. ఇపుడు కొన్ని ప్రాంతీయ పార్టీల వైపు అవి మళ్ళిపోతున్నాయి. దాంతో ఆయా వర్గాలను తిరిగి అక్కున చేర్చుకునే క్రమంలో కాంగ్రెస్ అగ్ర నేత ఈ విధంగా వ్యాఖ్యానించారు అని అంటున్నారు నిజానికి ఆయన లేవనెత్తిన ప్రశ్న సహేతుకంగా ఉంది. ఎంతో ఆలోచింప చేస్తున్నట్టుగా ఉంది. ఈ దేశంలో జరిగే అభివృద్ధిలో వారి పాత్రని కూడా మరోసారి చర్చించుకునేలా ఉంది. ఇది పాలకులకు సూటి ప్రశ్నగానే చూడాలి. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని రాహుల్ గాంధీ రాజకీయంగానే కాదు సామాజికపరంగా సిద్ధాంతపరంగా కూడా గట్టిగా నిలదీస్తున్న నేపథ్యం కూడా ఇందులో కనిపిస్తోంది. మరి ఈ ప్రశ్నలకు బదులు ఏలికలే ఇవ్వగలరు మరి బీజేపీ రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాల్సి ఉంది.

# తహసీల్దార్ బండి నాగేశ్వర్ రావు నివాసంలో ఏసీబీ సోదాలు



సుబేదారి, ఆగస్టు29:హనుమకొండ జిల్లా ఖాజీపేట చైతన్య పురిలో ఖిలా వరంగల్ తహసీల్దార్ బండి నాగేశ్వర్ రావు ఇంట్లో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. నాగేశ్వరరావు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడనే ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో నాగేశ్వర్ రావుకు చెందిన నివాసంతో పాటు ఖమ్మం,హైదరాబాద్,కరీంనగర్, ఆదిలాబాద్ తో పాటుగా మొత్తం ఎనిమిది చోట్ల ఆయన నివాసాలు, బంధువుల ఇళ్లలో ఎనిమిది ఏసీబీ బృందాలు ఉదయం నుంచి సోదాలు చేపట్టారు. కాజీపేటలోని ఆయన ఇంట్లో ఆస్తులకు సంబంధించిన డాక్యుమెంట్లు, కొంత నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నారు. నాగేశ్వరరావు అక్రమ ఆస్తుల ఆరోపణలపై ఏక కాలంలో ఎనిమిది చోట్ల ఏసీబీ రైడ్స్ చేపట్టడంతో రెవెన్యూశాఖలో కలకలం

# రేవంత్ రెడ్డిపై విచారణ జరిపించండి.. ఈడీకి మన్నె క్రిశాంక్ ఫిర్యాదు



న్యూఢిల్లీ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బావమరిది కంపెనీ శోధ కన్‌స్ట్రక్షన్స్‌పై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ఢిల్లీలోని ఈడీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనంత ఫిర్యాదురం మన్నె క్రిశాంక్ మాట్లాడారు. కేవలం రూ. 7 లక్షల ఆర్థిక లావాదేవీలు ఉన్న రేవంత్ రెడ్డి బావమరిది శోధ కన్‌స్ట్రక్షన్స్‌కు అమృత్ టెండర్లు, సింగరేణి మైనింగ్ కాంట్రాక్టు, డిండి ఇరిగేషన్ కాంట్రాక్టు ఇవ్వడంపై విచారణ చేపట్టాలని ఫిర్యాదులో ఉన్నట్లు క్రిశాంక్ తెలిపారు. గతంలో రేవంత్ రెడ్డి పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్నపుడు ఏ కంపెనీ పేరు మీద ఉన్న కారు వాడాడో ఇప్పుడు అదే కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీకి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 650 కోట్ల విలువ గల మూడు కాంట్రాక్టులు ఇవ్వడం చట్ట వ్యతిరేకం.. దానిపై కూడా విచారణ జరగాలి. ఇటీవలే ఒక సంచలన కేసులో ఒత్తిడి పెడితే తప్పుకున్న జడ్జి విషయంలో కేసీఆర్ ఇన్‌ఫ్రాటెక్, సీఎం రేవంత్‌పై విచారణ జరపాలని కూడా ఫిర్యాదులో పేర్కొన్నట్లు మన్నె క్రిశాంక్ తెలిపారు. వీటన్నింటికి సంబంధించిన ఆధారాలతో సహా ఈడీకి సమర్పించినట్లు ఆయన పేర్కొన్నారు.

## ఎన్‌హెచ్ 44పై రాకపోకలపై ఆంక్షలు

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో పలుచోట్ల 44వ నంబర్ జాతీయ రహదారి దెబ్బతింది. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుండటంతో అధికారులు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ నుంచి ఎన్‌హెచ్ 44 వైపు వెళ్లే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు- సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావ్ భూపాల్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న వాహనాలను మేడ్చల్ చెక్‌పోస్ట్ వద్ద మళ్లిస్తున్నట్లు- పేర్కొన్నారు. మేడ్చల్ చెక్‌పోస్ట్, సిద్దిపేట, కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్ మీదుగా ఆదిలాబాద్ వెళ్లాలని గజరావ్ భూపాల్ సూచించారు. పోలీసులకు ప్రయాణికులు సహకరించాలని ఆయన కోరారు. దూరప్రాంతాలకు వెళ్లే వారు ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు మళ్లింపు మార్గాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు. ప్రయాణికులకు సహాయం కోసం ట్రాఫిక్ పోలీసులు, హైవే పెట్రోలింగ్ బృందాలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. భారీ వర్షాలతో కామారెడ్డి సమీపంలో 44వ జాతీయ రహదారి ధ్వంసమైంది.. దీంతో 25 శాతం రాకపోకలు మాత్రమే జరుగుతున్నట్లు- ఆ జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వాహనదారులు మేడ్చల్-రామాయంపేట్-కామారెడ్డి-డిచ్‌పల్లి మార్గంలో కాకుండా ప్రత్యామ్నాయ దారుల్లో రాకపోకలు సాగించాలని సూచించారు. భారీ వాహనాలను మేడ్చల్ వద్ద.. సాధారణ వాహనాలను రామాయంపేట వద్ద మళ్లిస్తున్నట్లు- తెలిపారు. ప్రజలు దీన్ని గమనించాలని కోరారు. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ మార్గంలో వెళ్లే వాహనదారులకు నిర్మల్ పోలీసులు పలు సూచనలు చేశారు. ఆదిలాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనదారులు నిర్మల్ సమీపంలోని కొండాపూర్ బ్రిడ్జి నుంచి ఎడమవైపునకు తిరిగి డైవర్షన్ మార్గునని వెళ్లాలని సూచించారు. కొండాపూర్ నుంచి మామడ, ఖానాపూర్‌మెట్, జగిత్యాల, కరీంనగర్ మీదుగా హైదరాబాద్ వెళ్లాలని నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.

## వీటిపైనే ఎక్కువ ప్రభావితం

న్యూఢిల్లీ,భారత్ పై 50 శాతం అమెరికా సుంకాల మోత నేటి నుంచి అమలులోకి వచ్చింది. ఇప్పటి వరకు ట్రంప్ నుంచి ఉపశమనం ఏదైనా ఉంటుందేమోనని ఆశించారంతా. కానీ అలాంటి ఉద్దేశమేమీ ఆయనకు లేదని స్పష్టమైంది. ఈరోజునుంచి భారత్ ఎగుమతులపై అమెరికా 50శాతం సుంకాలను ముక్కుపిండి వసూలు చేస్తుంది.

రొయ్యలపై మోత..

ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య 48బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతోంది. ఈ సుంకాల యుద్ధంలో బాగా నలిగిపోయే రంగం రొయ్యల వ్యాపారం. అత్యధిక ప్రభావం పడేది ఈ రంగంపైనే. భారత్ నుంచి ఎగుమతి అయ్యే రొయ్యల్లో 32.4 శాతం అమెరికాకు చేరుకుంటున్నాయి. రొయ్యల ఎగుమతులపై టారిఫ్ ని 50 శాతానికి అమెరికా పెంచింది. సో ఈ రంగంలో ఎగుమతులు చేసేవారికి అత్యధిక నష్టాలు తప్పవన్నమాట. పెట్రోలియం ఉత్పత్తుల విషయానికొస్తే.. భారత్ నుంచి ఎగుమతి అయ్యే ఉత్పత్తుల్లో అమెరికాకు చేరుకునేవి కేవలం 4.3 శాతం మాత్రమే. వీటిపై అమెరికా 6.9 శాతం సుంకాలను వసూలు చేస్తోంది. సో పెట్రోలియం ఉత్పత్తులపై పెద్ద ప్రభావం లేదనే చెప్పాలి.

ఆర్గానిక్ రసాయనాలు..

భారత్ నుంచి ఎగుమతి అయ్యే ఆర్గానిక్ రసాయనాలలో 13.2 శాతం అమెరికాకు చేరుకుంటున్నాయి. వీటిపై అమెరికా 54 శాతం సుంకాలు విధిస్తోంది. అంటే ఈ రంగంపై కూడా ప్రభావం అధికమనే చెప్పాలి. ఫార్మా రంగంపై కొత్తగా టారిఫ్ విధించలేదు. అయితే ఫార్మా ఎగుమతుల్లో అమెరికాకు అత్యధికంగా 39.8 శాతం వెళ్తున్నాయి. సుంకాలు పెరగలేదు కాబట్టి ఫార్మా రంగం సేఫ్. ఇక కార్పెట్ల ఎగుమతులు కూడా భారత్ నుంచి అమెరికాకు ఎక్కువ. మన దేశంలో తయారయ్యే కార్పెట్లు 58.6 శాతం అమెరికాకు వెళు న్నాయి. వీటిపై కూడా అమెరికా సుంకాలు పెంచింది. మొత్తంగా 52.9 శాతం టారిఫ్ కట్టాలి. అంటే కార్పెట్ ఎగుమతులు కూడా దెబ్బతినే అవకాశం స్పష్టంగా ఉంది. రెడీమేడ్ దుస్తుల విభాగంలో టారిఫ్ 63.9 శాతానికి చేరుకుంది. భారత్ నుంచి 34.5 శాతం రెడీమేడ్ దుస్తులు అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. ఈ రంగంపై కూడా సుంకాల మోత తప్పదనే చెప్పాలి. అల్లిన దుస్తులు 32.2 శాతం అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. వీటిపై అత్యధికంగా 60.3 శాతానికి టారిఫ్ పెరిగింది. అంటే ఇకపై భారత్ లో అల్లిన దుస్తులు అమెరికాకు ఎగుమతి చేయాలంటే ఎగుమతి దారులు భారీగా నష్టపోవాల్సిందే. జౌళి పరిశ్రమపై కూడా 59 శాతానికి టారిఫ్ పెరిగింది. వజ్రాభరణాలు 40శాతం అమెరికాకు ఎగుమతి చేస్తోంది భారత్. ఈ రంగంపై సుంకాలు 52.1 శాతానికి పెరిగాయి. స్టీల్, అల్యూమినియం, కాపర్ ఉత్పత్తులు 16.6 శాతం అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. వీటి ఉత్పత్తులపై అమెరికా 51.7 సుంకం వసూలు చేస్తోంది. అంటే ఈ రంగంపై కూడా ప్రభావం ఎక్కువేనని చెప్పాలి.

స్మార్ట్ ఫోన్లకు నో ప్రాబ్లమ్..

భారత్ నుంచి స్మార్ట్ ఫోన్ల ఎగుమతులు అమెరికాకు భారీగానే జరుగుతున్నాయి. 43.9 శాతం అమెరికాకు భారత్ ఎగుమతి చేస్తుండగా, దీనిపై టారిఫ్ లేదు. అంటే స్మార్ట్ ఫోన్ల ఎగుమతి రంగంపై ప్రభావం పడేదేమీ లేదు. 2021-22 నుంచి భారత్ కు అమెరికా అతి పెద్ద బిజినెస్ పార్ట్ నర్ గా ఉంది. 2024-25లో ఈ రెండు దేశాల మధ్య 131.8 బిలియన్ డాలర్ల మేరకు భారీ వ్యాపారం జరిగింది. ఇందులో 86.5 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు, 45.3 బిలియన్ డాలర్ల మేర దిగుమతులు ఉన్నాయి. తాజా టారిఫ్ ల వల్ల రొయ్యల ఎగుమతులు, జౌళి రంగం, స్టీల్, అల్యూమినియం, కాపర్ ఎగుమతులపై తీవ్రమైన ప్రభావం కనపడుతుంది. అంటే ఆయా రంగాల్లో ఎగుమతులకు భారత్ కొత్త మార్కెట్ ని వెదుక్కోవాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది.

## నిండుకుండలా మానేరు జలాశయం

కరీంనగర్,ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో మానేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. నర్మాల వద్ద ఎగువ మానేరు జలాశయం నిండుకుండను తలపిస్తోంది. దీంతో దిగువకు వరద నీటిని విడుదల చేశారు. మరోవైపు మిడ్ మానేరుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మధ్య మానేరు 17 గేట్ల నుంచి 33 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, సంగారెడ్డి, హనుమకొండ, వరంగల్, పెద్దపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ మేరకు వాతావరణ శాఖ వెల్లడించింది. సిద్దిపేట, మెదక్, జనగామ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో నేడు, రేపు తెలంగాణలో భారీవర్షాలు కురిసే అవకాశముంది. నేడు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే వీలుందని వాతావరణశాఖ తెలిపింది. నేడు ఆదిలాబాద్, కుమురం భీం, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్, భూపాలపల్లి, ములుగు, హనుమకొండ, వరంగల్, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని వెల్లడించింది. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

## కోరుకున్నవారికి కోరుకున్న చోట! పన్నుల శాఖలో నిబంధనలకు పాతర!



హైదరాబాద్,నచ్చినవారికి, మెచ్చినవారికి, పైరవీలు చేసుకున్నవారికి కోరుకున్న చోట.. కోరుకున్న కొలువు దొరుకుతుందనేందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి ఈ ఉదంతాలు. వీటిపై తెలంగాణ సచివాలయంలో జోరుగా చర్చ నడుస్తున్నది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కొందరు నియమ నిబంధనలకు నీళ్లు వదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పన్నుల శాఖలో మొన్నటి వరకూ పనిచేసి, ఆ తరువాత ఐఏఎస్ అధికారిగా పదోన్నతి (కన్ఫర్డ్) పొందిన ఒక ఉద్యోగి.. తెలంగాణ సచివాలయంలో కొద్ది నెలలు పనిచేశారు. తిరిగి మళ్లీ మాతృ విభాగంలో డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఒక ఐఏఎస్ అధికారికి స్వంత జిల్లాలో కలెక్టర్‌గా పోస్టింగ్ ఇవ్వకూడదు కానీ.. ఇచ్చారు. నాన్ ఐఏఎస్ అధికారికి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించకూడదని నిబంధనలు చెబుతున్నా.. వాటిని పక్కకు నెట్టేసి.. అప్పగించారు. నిరాటంకంగా సాగుతున్న ఈ నిబంధనల ఉల్లంఘనలపై కేంద్ర ప్రభుత్వం, డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీఓపీటీ) కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు సచివాలయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇలాంటి ఉల్లంఘనలను సమీక్షించి, నియంత్రించే బదులు కొనసాగిస్తుండడం కంచె చేను మేసిన చందంగా ఉందని పలువురు ఉన్నతాధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుకు ముందు 1956 వరకు మద్రాస్ రాష్ట్రం పరిధిలో రెవెన్యూ బోర్డు ఉంది. ఆ తరువాత రెవెన్యూ బోర్డును తీసేసి ప్రత్యేకంగా వాణిజ్య పన్నుల కమిషనరేట్ ఏర్పాటు చేశారు. ఈ పదవికి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు పూర్వం కూడా ముఖ్య కార్యదర్శి స్థాయి లేదా సీనియర్ ఐఏఎస్ అధికారులను కమిషనర్‌గా నియమించేవారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాబడి తెచ్చే విభాగం కావడంతో అనుభవం ఉన్న ఐఏఎస్‌లకే ప్రభుత్వం ప్రాముఖ్యం ఇచ్చేది. ప్రతి రోజు ఉదయం ముఖ్యమంత్రి కార్యాలయానికి వాణిజ్య పన్నుల కమిషనర్, అంతకు ముందు రోజు రాబడిపై రిపోర్టు ఇచ్చే విధానం అమల్లో ఉంది. ఇంతటి ముఖ్యమైన వాణాజ్య పన్నుల శాఖలో జూనియర్ ఐఏఎస్ అధికారి, అది కూడా అదే శాఖలో పనిచేసి పదోన్నతి పొందిన వారికి కీలక బాధ్యతలు ఇవ్వడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఆర్థిక శాఖలో జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న ఉద్యోగిని కమర్షియల్ ట్యాక్స్ డైరెక్టర్‌గా నియమించారు. ఇలాంటి ముఖ్యమైన పోస్టులలో ఐఏఎస్‌లను నియమించే ముందు ప్రధాన కార్యదర్శి అన్ని కోణాల్లో ఆలోచించి, నియామక పైలును సిద్ధం చేసే ముందు ముఖ్యమంత్రికి తెలియచేస్తారు. అయితే.. జూనియర్ అధికారి డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టే ముందు కమిషనర్‌గా అనిల్ కుమార్ పనిచేశారు. ఆయన చాలా సీనియర్ ఐఏఎస్ అధికారి కూడా. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అప్పటి ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జూనియర్ అధికారిణి వివరాలు తెలియచేసి నియమించారా? లేదా మరేదైనా కారణం ఉందా? అనే చర్చ నడుస్తున్నది. ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు కూడా ఈ బదిలీకి ఎలా ఆమోదం తెలిపారో కూడా తెలియడం లేదని వాణిజ్య పన్నుల శాఖ అధికారవర్గాల్లో చర్చ జరుగుతున్నది. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ విభాగాలకు సీనియర్ ఐఏఎస్‌లను నియమిస్తారు. ఈ పదవుల ఎంపికలో ముఖ్యమంత్రితో పాటు ఆర్థిక శాఖ, రెవెన్యూ, వాణిజ్య పన్నుల శాఖల మంత్రుల సిఫారసులకు పెద్దపీట వేస్తారు. వీరి సిఫారసుల మేరకు సంబంధిత పదవులకు అధికారులను ఎంపిక చేసి ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేస్తారని ఉన్నతాధికారులు చెబుతున్నారు.తెలంగాణ వాణిజ్య పన్నుల విభాగంలో 1998 బ్యాచ్ కు చెందిన జూనియర్ అధికారి.. 2013 బ్యాచ్ ఐఏఎస్ అధికారిగా కన్ఫర్డ్ అయ్యారు. నాన్ స్టేట్ సివిల్ సర్వీసెస్ కోటాలో మొత్తం ఐదుగురికి ఐఏఎస్‌గా పదోన్నతి కల్పించేందుకు 2023లో యూపీఎస్సీ ఇంటర్వ్యూలు చేయగా, డీఓపీటీ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత నిర్ణీత గడువులోగా ఖాళీలను గుర్తించి, నోటిఫై చేయాల్సి ఉంది. కాని ఆ పని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చేయకపోవడం మూలంగా కన్ఫర్డ్ ఐఏఎస్ ఖాళీల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీంతో 2023లో ఒకే విడతలో ఐదుగురు నాన్ ఎస్సీఎస్ అధికారులు ఐఏఎస్ లుగా ఎంపికయ్యారు. ఇదిలా ఉంటే వాణిజ్య పన్నుల కమిషనరేట్ లో తాజాగా నియమితులైన అధికారి కంటే అంతకు ముందు పనిచేసిన సహచర అధికారులు, సీనియర్లు పనిచేస్తున్నారు. మొన్నటి వరకు మనతో కలిసి పనిచేసిన జూనియర్‌ను తమ బాస్‌గా అంగీకరించేందుకు వారి మనసు అంగీకరించడం లేదనే చర్చ నడుస్తోంది. వాణిజ్య పన్నుల విభాగంలో పనిచేసిన జూనియర్‌కు పదోన్నతి ఇచ్చిన తరువాత అదే శాఖలో పంజగుట్ట అడిషనల్ కమిషనర్ గా నియమించారు. 2023 జూలై నెలలో అక్కడి నుంచి బదిలీ చేసి బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఆర్థిక శాఖలో జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఆ తరువాత మళ్లీ మాతృశాఖ అయిన వాణిజ్య పన్నుల శాఖకు డైరెక్టర్ గా పంపడం పలువురు అధికారులు, వ్యాపారవర్గాలను అప్పట్లో ఆశ్చర్యానికి గురి చేసిందనే చెప్పాలి.

## వర్ష బీభత్సంతో గజగజ వణికిన ఉత్తర తెలంగాణ



హైదరాబాద్/సిద్దిపేట/ మెదక్/నిజామాబాద్/నిర్మల్/ : భీకర వర్షాలతో రాష్ట్రం వణికిపోతోంది. బుధ, గురువారాల్లో కురిసిన అతిభారీ వానలకు కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. నిర్మల్, మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో వర్షం తీవ్ర ప్రభావం చూపింది. వాగులు, వంకలు పోటెత్తి.. చెరువులు తెగిపోయి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు, వంతెనలు, రైల్వే లైన్లు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. లక్షలాది ఎకరాల్లో పంట నీట మునిగిపోయింది. వరద ఉధృతికి కారణం కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించిపోయాయి. వందలాది గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కరెంటు సరఫరా నిలిచిపోయి అంధకారంలో మగ్గుతున్నాయి. భారీ వరదలకు పదిమందికిపైగా గల్లంతైనట్టు తెలిసింది.

కామారెడ్డి కకావికలం

కనీవినీ ఎరగని రీతిలో ఏకధాటి వానలతో కామారెడ్డి పట్టం కకావికలమైంది. జిల్లాలో వందలాది కాలనీలు నీటి మునిగాయి. కాలు బయట పెట్టే పరిస్థితి లేక దాదాపుగా 40 గంటల పాటు ప్రజలు ఇండ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. పట్టణంలో 12 అడుగుల ఎత్తుతో వరద ప్రవహించడంతో ఎన్జీవో, జీఆర్ కాలనీలు భయానక పరిస్థితిలో కొట్టుమిట్టాడాయి. కామారెడ్డి శివారు ప్రాంతంలో పంట పొలాల మీదుగా తన్నుకు వచ్చిన వరద అంతకంతకూ పెరిగి భవనాలను ముంచెత్తుతూ ముందుకు సాగింది. కామారెడ్డి పెద్ద చెరువు ఎన్నడూ లేని విధంగా అలుగు దుంకడంతో సమీప ప్రాంతాల నివాసితులు ప్రాణభయంతో వణికిపోయారు. పదుల సంఖ్యలో వాహనాలు కొట్టుకు పోయాయి. రోడ్లవెంట ఉంచిన లారీలు, భారీ వాహనాలు వరద ధాటికి చెల్లాచెదురయ్యాయి. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత నివాసాలు బురదతో నిండిపోయాయి. రోడ్లు నామ రూపల్లేకుండా పోయాయి. గ్రామాలు, తాండాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భవానిపేట శివారులో ఎర్రగుంట వద్ద చెక్ డ్యామ్ కొట్టుకుపోయి గ్రామాన్ని తాకుతూ పెద్ద వాగు ప్రమాదకరంగా ప్రవహించింది. ఎల్లారెడ్డి నుంచి హైదరాబాద్ మార్గంలో చెరువు తెగి రాకపోకలు బందయ్యాయి. నాగిరెడ్డిపేట మండలం నడిమితండాలో గిరిజనులు బుధవారం వరదలో చిక్కుకొని ఆర్తనాదాలు చేశారు. కామారెడ్డి మండలం లింగాయిపల్లి శివారులో వరదలో నలుగురు, చిన్నమల్లారెడ్డి చెరువు వద్ద ముగ్గురు చిక్కుకోగా రక్షణ దళాలు కపాడాయి. కామారెడ్డి నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు వెళ్లే మార్గంలో పాల్వంచ వాగు ఉగ్రరూపం దాల్చి రాకపోకలు నిలిచిపోయాయి. బొగ్గు గుడిసె సమీపంలో ఎన్‌హెచ్ పనులు చేస్తున్న 8 మంది బీహార్ కూలీలు, గున్‌కుల్‌లో కోళ్ల ఫారంలో ముగ్గురు చిక్కుకోగా రక్షణ దళాలు కాపాడాయి. రాజంపేటలో గోడ కూలి ల్యాబ్ టెక్నిషియన్ చనిపోయాడు. జిల్లా వ్యాప్తంగా 36కు పైగా చెరువులు తెగినట్టు ఇరిగేషన్ శాఖ ప్రకటించింది. మంజీరా ఉగ్రరూపం, నిజాంసాగర్ గేట్లు ఎత్తి దిగువన లక్షన్నర క్యూసెక్కులు వదలడంతో అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయి.

ఎన్‌హెచ్ 44, రైల్వే ట్రాక్ ధ్వంసం

కామారెడ్డిలో కురిసిన అత్యంత భారీ వర్షానికి ఎన్‌హెచ్ 44 నామరూపల్లేకుండా కొట్టుకుపోయింది. భిక్కనూరు మండలం జంగంపల్లి వద్ద రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్డు మధ్యలో 20 అడుగుల వెడల్పుతో భారీ గుంత ఏర్పడింది. బుధవారం ఉదయం నుంచే హైవేపై వరద పెరగడంతో పోలీసులు వాహనాలను నియంత్రించారు. వెనక్కి వెళ్లలేక, ముందుకు కదల్లేక గంటల కొద్దీ వాహనదారులు నరకయాతన పడ్డారు. భిక్కనూర్ మండలం రామేశ్వరపల్లి శివారులో భిక్కనూర్ %-% తలమడ్ల రైల్వే స్టేషన్ మధ్య వరద ఉధృతికి రైల్వే ట్రాక్ కొట్టుకు పోయింది. 10 మీటర్ల పొడవునా పట్టాలు తెగిపోవడంతో రైళ్ల పోకలను సౌత్ సెంట్రల్ రైలే నిలువరించింది. బుధవారం పలు రైళ్లను రద్దు చేయగా గురువారం నుంచి మహారాష్ట్రకు వెళ్లే రైళ్లను దారి మళ్లిస్తున్నారు.

నిర్మల్ జల దిగ్బంధం

నిర్మల్ పట్టణంలోని చాలా కాలనీలు నీట మునిగాయి. జీఎన్ఆర్ కాలనీవాసులు ఇండ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. కుంటాల మండలం జలదిగ్బంధంలో చిక్కుకుంది. నిర్మల్ పట్టణం, మండలంలో అత్యధికంగా 33 సెంటీమీటర్ల రికార్డుస్థాయి వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు ఉప్పొంగి చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుకుండలను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు కొట్టుకుపోయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే పాత జాతీయ రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. బాసర మండలం బిద్రెల్లి వద్ద వాగు ఉధృతికి భైంసా -నిజామాబాద్ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. మునిపెల్లిలో పశువుల కాపరి వాగులో చిక్కుకుపోయిన ఎన్డీఆర్ఎఫ్ బృందం కాపాడింది. వరద పోటెత్తడంతో కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టు గేట్లను ఎత్తివేశారు.

మెదక్ అతలాకుతలం

మెదక్ జిల్లాలో 40 ఏండ్లలో ఎన్నడూ పడని విధంగా బుధవారం భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు ఉప్పొంగాయి. ఏర్పాటు దూప్సింగ్ తండా రెండు రోజులుగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. హవేళీ ఘనపూర్ మండలం రాజ్‌పేటకు చెందిన సత్యనారాయణ, యాదగౌడ్ ఇద్దరూ ఆటోల్లో మెదక్‌లో ఉన్న వాళ్ల పిల్లలను తీసుకొచ్చేందుకు బయలుదేరారు. మార్గమధ్యలో నక్కవాగు దాటుతూ వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. వీరిద్దరూ కరెంటు స్తంభాన్ని పట్టుకొని నాలుగు గంటల పాటు తమను కాపాడాలని వేడుకున్నారు. జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వరద ఉధృతి మరింత పెరిగి కరెంటు స్తంభం కొట్టుకుపోవడంతో చనిపోయారు. నిజాంసాగర్ గేట్లు ఎత్తి వరదను వదల అనేక గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. వాడి నుంచి రాజపేట వరకు మార్గమధ్యలో రోడ్లు ధ్వంసమయ్యాయి. కరెంటు స్తంభాలు విరిగి రోడ్లపై పడ్డాయి. రెండు రోజులుగా హవేళీఘన్‌పూర్ మండలంలో ఐదు గ్రామాలకు విద్యుత్తు, సరఫరా నిలిచిపోయింది. రేగోడ్ మండలం మర్పల్లిలో బండి హరికృష్ణ(22) మంగళవారం చనిపోగా బుధవారం అంత్యక్రియలకు గొల్ల వాగు దాటే వీలు లేక ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ సాయంతో అంత్యక్రియలు చేశారు. మెదక్-శమ్నాపూర్ వద్ద రైల్వే ట్రాక్ కుంగిపోయింది.

చిగురుటాకుల సిద్దిపేట

కుండపోత వర్షానికి సిద్దిపేట జిల్లా కేంద్రం చిగురుటాకుల వణికిపోయింది. పలు కాలనీలు నీట మునిగాయి.కొత్త బస్టాండ్ నుంచి మోడ్రన్ బస్టాండ్ మధ్య రోడ్డు వెంబడి బ్రిడ్జిపైన నీరు చేరి రాకపోకలు స్తంభించిపోయాయి. కోమటి చెరువు ఊధృతికి శ్రీనగర్ కాలనీ, శ్రీనివాస నగర్‌లోని ఇతర ప్రాంతాలు జలమయమయ్యాయి. సీతారామాంజనేయ థియేటర్ వద్ద రోడ్డుపై నీళ్లు చేరి ప్రజలు ఈత కొట్టుకుంటూ రోడ్డు దాటారు. చిన్ననిజాంపేటకు చెందిన రైతులు రాజు, గోపాల్, సుదర్శన్ వ్యవసాయ పనులకు వెళ్లి చెరువు ఉధృతికి చిక్కుకుపోయి రాత్రంతా అక్కడే ఉండగా గురువారం ఉదయం ఎన్డీఆర్ఎఫ్ బృందం రక్షించింది.

రైతులను రక్షించిన ఆర్మీ హెలికాప్టర్

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ఆర్మీ హెలికాప్టర్ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. నర్మాలలో మానేరువాగు ప్రవాహంలో చిక్కుకున్న ఐదుగురు రైతులను ఆర్మీ హెలికాప్టర్ ద్వారా రక్షించారు. వీరు బుధవారం మధ్యాహ్నం పశువులను మేపేందుకు వెళ్లి వాగులో చిక్కుకొని గడ్డమీద ఉండిపోగా డ్రోన్ ద్వారా అధికారులు ఆహారం అందించారు.

రికార్డు స్థాయి వర్షపాతం

కామారెడ్డి జిల్లాలో గడిచిన 48 గంటల్లో 65 సెం.మీ ఆల్‌టైమ్ రికార్డ్ వర్షపాతం నమోదైంది.

## సహాయకచర్యలకు హెలికాప్టర్లు

కరీంనగర్,తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. భారీ వర్షాల కారణంగా లోతట్టు- ప్రాంతాల ప్రజలు వరదల్లో చిక్కుకున్నారు. ఈ నేపథ్యంలో వరదల్లో ఉన్నవారిని రక్షించడానికి రాష్ట్రానికి మూడు ఆర్మీ హెలికాప్టర్లు రావాల్సి ఉంది. హెలికాప్టర్లు ఎంతకు రాకపోయే సరికి రక్షణ శాఖ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్ చేసి సమాచారం తెలుసుకున్నారు. హెలికాప్టర్లను సిద్ధం చేసినట్లు- కేంద్ర రక్షణ శాఖ అధికారులు చెప్పారని తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో బాధిత ప్రాంతాలకు చాపర్లు రావడంలో ఆలస్య మవుతోందని వివరించారు. ప్రత్యామ్నాయ స్టేషన్ల నుంచి చాపర్లను రప్పించేందుకు చర్యలు చేపడుతు న్నట్లు పేర్కొన్నారు. నాందెడ్, బీదర్ స్టేషన్ల నుంచి చాపర్లను పంపేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు బండి సంజయ్ స్పష్టం చేశారు. భారీ వర్షాలతో ఎస్సారెస్పీ, మానేరు నదులకు విపరీతంగా వరద వస్తోందని పేర్కొన్నారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా తరలించే పక్రియను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన తీసుకుని చర్యలు చేపట్టాలన్నారు. సహాయక చర్యలకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు ఎన్డీఆర్ఎఫ్ టీ-ంలు నిమగ్నమయ్యాయని ఆయన చెప్పుకొచ్చారు. వీలైనంత తొందరగా చాపర్లను పంపాలని కేంద్ర ప్రభుత్వాన్ని బండి సంజయ్ కోరారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ముప్పు ప్రాంతాల వారిని అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. ఏదైనా సమస్య ఎదురైతే.. వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని బండి సంజయ్ సూచిస్తున్నారు. తెలంగాణకు ఆర్మీ హెలికాప్టర్ల రాక ఆలస్యంపై రక్షణ శాఖ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోన్ చేశారు. తెలంగాణకు మూడు హెలికాప్టర్లను రెడీగా ఉంచామని కేంద్ర రక్షణ శాఖ అధికారులు తెలియజేశారు. ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండటంతో వాతావరణం అనుకూలించక పోవడంతో బాధిత ప్రాంతాలకు చాపర్ల రాక ఆలస్యమవుతోందని అధికారులు వివరించారు.ప్రత్యామ్నాయ స్టేషన్ల నుండి చాపర్లను రప్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారని పేర్కొన్నారు. నాందేడ్, బీదర్ స్టేషన్ల నుండి చాపర్లను పంపేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. భారీ వర్షాలతో ఎస్సారెస్పి, మానేరు నదులకు విపరీతంగా వరద వస్తోందని బండి సంజయ్ చెప్పారు. వరద ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా తరలించే పక్రియను రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన తీసుకునే చర్యలకు పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు

## ఎపి వ్యాప్తంగా భారీ వర్షాలు

అమరావతి,ఏపీలో భారీ వర్షాలు బీభత్సంగా కురుస్తున్నాయి. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడం వల్ల అనేక గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. నదులు, వాగులు పొంగిపొర్లు తున్నాయి. రోడ్లు నీటితో నిండిపోయి, రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అప్రమత్తమైన ప్రభుత్వం ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనిలో ఉంది. మత్స్యకారులు సముద్రానికి వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశాయి. అవసరం లేకుండా బయటకు రావొద్దని అధికారులు కోరుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. గురువారం నాడు హోంమంత్రి అనిత ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఫోన్ చేసి మాట్లాడారు. వర్షాలపై అధికారులను అప్రమత్తం చేశారు. కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు దిశానిర్దేశర చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు హోంమంత్రి అనిత. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ కీలక ప్రకటన చేశారు. కృష్ణా నది వరద ప్రవాహం భారీగా పెరుగుతుందన్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద ఉధృతంగా వస్తోందని చెప్పారు. మధ్యాహ్నం లోపు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందన్నారాయన. ప్రస్తుత ఇన్‌ఎ÷-లో, ఔట్ ప్ల 3.62 లక్షల క్యూసెక్కులు ఉందన్నారు. ప్రభావిత జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారాయన. కృష్ణానది పరీవాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. లంక గ్రామ ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వరదలు వస్తున్న నేపథ్యంలో వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదని హెచ్చరించారు ప్రఖర్ జైన్.

## కామారెడ్డి జిల్లాలో పలు రోడ్లు ధ్వంసం

కామారెడ్డి,కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. కుంభవృష్టి ధాటికి పలుచోట్ల జనజీవనం స్తంభించిపోయింది. చాలా ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. బీబీపేట నుంచి కామారెడ్డి వెళ్లే మార్గంలో వరద నీటి దాటికి వంతెన కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు క్యాసంపల్లి శివారులో వరద తీవ్రతకు జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో నిజామాబాద్ వైపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. క్యాసంపల్లి శివారులో హైవేపై ఏర్పడిన గుంత కారణంగా రోడ్డు ధ్వంసమైంది. మెదక్-బోధన్ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. పోచారం జలాశయానికి భారీగా వరద పో-టె-త్తడంతో మెదక్, బోధన్ ప్రధాన రహదారిపై హై లెవల్ వంతెన కొట్టు-కుపోయింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇరువైపులా వాహనాలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మరో మార్గం నుంచి వాహనాలు ప్రయాణించే విధంగా అధికారులు ఏర్పాట్లు- చేశారు.

## అమెరికా గడ్డపై భారత్ జెండా..

న్యూఢిల్లీ, భారతదేశానికి చెందిన రెండు స్టార్టప్ కంపెనీలు అగ్రరాజ్యంలో త్రివర్ణ పతాకాన్ని ఎగరవేశాయి. ఓ వైపు అమెరికా భారత్‌పై సుంకాలతో దాడులు చేస్తున్న సమయంలో..భారతదేశ ప్రైవేట్ అంతరిక్ష రంగం తన ప్రయాణంలో గొప్ప ముందడుగును చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించింది. బెంగళూరుకు చెందిన పిక్సెల్, హైదరాబాద్‌కు చెందిన ధ్రువ్ స్పేస్ స్టార్టప్ కంపెనీలు అమెరికాలోని ఎలోన్ మస్క్ కంపెనీ స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ ద్వారా తమ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి సక్సెస్ ఫుల్‌గా ప్రవేశపెట్టాయి. ఈ ప్రయోగం కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి విజయవంతంగా జరిగింది. ఇక్కడ విశేషం ఏమిటంటే అంతర్జాతీయ ప్రయోగాలపై సుంకాల పెంపునకు ముందు విండో క్లోజ్ అవుతున్న సమయంలో రెండు కంపెనీలు ఈ ఘనతను సాధించాయి.

ప్రైవేట్ అంతరిక్ష రంగంలో భారత్..

ఒకే రాకెట్‌లో అంతరిక్షంలోకి చేరుకున్న రెండు భారతీయ స్టార్టప్ కంపెనీల ఉపగ్రహాలు వారి సాంకేతిక సంసిద్ధతను మాత్రమే కాకుండా అంతర్జాతీయంగా భారతదేశం విశ్వసనీయతను కూడా బలోపేతం చేశాయి. పిక్సెల్ ప్రపంచం కోసం మేడ్ ఇన్ ఇండియా కథను సృష్టిస్తుండగా, ధృవ్ స్పేస్ కస్టమర్ల కోసం నమ్మకమైన పేలోడ్ హోస్టింగ్ ప్లాట్‌ఫామ్‌గా అభివృద్ధి చెందుతోంది. ఈ ప్రయోగంతో భారత్ ఇకపై కేవలం రాకెట్ ప్రయోగ గమ్యస్థానం కాదని, అంతరిక్ష సమస్యల పరిష్కారాలను సృష్టించడంలో ప్రపంచవ్యాప్తంగా పాత్ర పోషించగలదని రుజువు చేస్తుంది.

# కామారెడ్డి కకావికలం.. కనీవినీ ఎరుగని రీతిలో వర్షబీభత్సం



నిజామాబాద్,కామారెడ్డి జిల్లాలో కుంభవృష్టి వర్షం కురిసింది. కనీవినీ ఎరుగని రీతిలో కురిసిన వర్షానికి జిల్లా చిగురుటాకుల వణికింది. జిల్లాలో వందలాది కాలనీలు నీటి మునిగాయి. ప్రజలు దాదాపుగా 40గంటల పాటు ఇండ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. కామారెడ్డి పట్టణంలో 12 అడుగుల ఎత్తుతో వరద ప్రవాహం ఉండటంతో ఎన్జీవో కాలనీ, జీఆర్ కాలనీలు భయానక పరిస్థితిలో కొట్టుమిట్టాడాయి. కామారెడ్డి శివారు ప్రాంతంలో పంట పొలాల మీదుగా తన్నుకు వచ్చిన వరద అంతకంతకు పెరిగి గ్రౌండ్ ఫ్లోర్ భవనాన్ని ముంచెత్తుతూ ముందుకు సాగింది.కామారెడ్డి పెద్ద చెరువు గతంలో ఎన్నడూ లేని విధంగా అలుగు దుంకింది. పెద్ద చెరువుకు కూత వేటు దూరంలో నివాసితులు ప్రాణ భయంతో వణికిపోవాల్సి వచ్చింది. ఓ వైపు పెద్ద చెరు వు అలుగు, మరో వైపు మెదక్ జిల్లా ప్రాంతం గుండా భారీ వరద పొలాల మీదుగా పరుగులు తీసింది. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 36కు పైగా చెరువులు తెగినట్టుగా ఇరిగేషన్ శాఖ ప్రకటించింది. అనధికారికంగా మరో 50కి పైగా చెరువులు ప్రమాదపు అంచుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. మంజీరా ఉగ్రరూపం దాల్చడం, నిజాంసాగర్ గేట్లు దిగువకు లక్షన్నర క్యూసెక్కులు వదలడంతో అనేక గ్రామాలు ముంపును ఎదుర్కోవాల్సి వచ్చింది. బొగ్గు గుడిసె సమీపంలో ఎన్‌హెచ్ పనులు చేస్తున్న 8 మంది బీహార్ కూలీలు, గున్‌కుల్‌లో కోళ్ల ఫారంలో ముగ్గురు చిక్కుకోగా రక్షణ వ్యక్తులు వారిని సురక్షితంగా కాపాడాయి. రాజంపేటలో గోడ కూలిన ఘటనలో ల్యాబ్ టెక్నీషియన్ మృతి చెందాడు. దోమకొండలో వరద ధాటికి ఆరు ఆవులు చనిపోయాయి. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆరుగొండలో రికార్డు స్థాయిలో 43.15 సెం. మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లుగా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పేర్కొన్నారు. పాల్వంచ మండలం ఎల్పుగొండలో 10వేల కోళ్లు వరదలో కొట్టుకుపోయాయి. కోళ్ల ఫారం నేలమట్టమైంది. రూ.30లక్షలకు పైగా నష్టం సంభవించిందని యజమాని ఐలేని నాగేశ్వరరావు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

అతలాకుతలం..

కామారెడ్డి పట్టణంలో పలు వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. రోడ్డుకు ఇరువైపులా నిలిపిన లారీలు, భారీ వాహనాలు వరద ధాటికి చెల్లాచెదురయ్యాయి. రోడ్లు కోతకు వచ్చాయి. కాలనీల్లో వరద తగ్గుముఖం పట్టిన తర్వాత బురదతో నివాసాలు నిండిపోయాయి. చెల్లాచెదురైన వంట సా మగ్రి పనికి రాకుండా పోయాయి. ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ వద్ద రోడ్డు తెగిపోయింది.లింగంపేట మండలం భవానిపేట్ గ్రామ శివారులో ఎర్రగుంట వద్ద చెక్ డ్యామ్ కొట్టుకుపోగా గ్రామాన్ని తాకుతూ పెద్దవాగు ప్రమాదకరంగా ప్రవహించింది. మెంగారం వద్ద రోడ్డు తెగడంతో లింగంపేట %-% ఎల్లారెడ్డికి రాకపోకలు నిలిచిపోయాయి. ఎల్లారెడ్డి నుంచి హైదరాబాద్ మార్గంలో చెరువు కట్టడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. నాగిరెడ్డిపేట మండలం నడిమితండాలో వరదలో గిరిజనులు చిక్కుకుని బుధవారం ఆర్తనాదాలు చేశారు. కామారెడ్డి వారి లింగాయిపల్లి శివారులో వరదలో నలుగురు, చిన్నమల్లారెడ్డి చెరువు వద్ద ముగ్గురు చిక్కుకొని సాయం కోసం ప్రాధేయపడగా రక్షించారు.

# పెద్దిరెడ్డి కుటుంబాన్ని వైసీపీ వదిలేసిందా?

అమరావతి,వైసీపీ అధికారంలో ఉన్నంత వరకూ జగన్ సర్కార్ లో అప్రకటిత నంబర్ 2 పొజిషన్ ను ఎంజాయ్ చేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇప్పుడు పార్టీలో ఏకాకి అయిపోయారా అంటే పరిస్థితులను బట్టి చూస్తే ఔననే అనిపించక మానదు. జగన్ అధికారంలో ఉన్నంత కాలం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు మిథున్ రెడ్డి పార్టీలోనూ, జిల్లాలోనూ తిరుగులేని ఆధిపత్యం చెలాయించారు. జగన్ కు అత్యంత సన్నిహితులుగా గుర్తింపు పొందారు. మరీ ముఖ్యంగా పెద్దిరెడ్డిది తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడి సొంత జిల్లా చిత్తూరు కావడంతో చిత్తూరు జిల్లాపై వైసీపీ ఆధిపత్యం కోసం జగన్ కూడా పెద్దిరెడ్డికి ఫ్రీ హ్యాండ్ ఇచ్చారు. చిత్తూరు ఎంత చంద్రబాబు సొంత జిల్లా అయినా.. తెలుగుదేశం పార్టీకి ఆ జిల్లాలో సంపూర్ణ ఆధిపత్యం గతంలో ఎన్నడూ లేదు. 2014 ఎన్నికలను తీసుకుంటే రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చినా చిత్తూరు జిల్లాలో మాత్రం తెలుగుదేశం పార్టీ 14 అసెంబ్లీ స్థానాలకు గాను కేవలం ఆరింటిలోనే విజయం సాధించగలిగింది. అదే 2019 ఎన్నికలకు వచ్చే సరికి ఇక్కడ తెలుగుదేశం పార్టీ కుప్పం వినా మిగిలిన 13 అసెంబ్లీ నియోజకవర్గాలలోనూ పరాజయం పాలైంది. అలాగే జిల్లాలోని చిత్తూరు, తిరుపతి పార్లమెంటు స్థానాలలోనూ ఓడిపోయింది. అయితే 2024 అసెంబ్లీ ఎన్నికలలో పరిస్థితిపూర్తిగా తిరగబడింది. ఆ ఎన్నికలలో వైసీపీ కేవలం రెండంటే రెండు స్థానాలలో మాత్రమే విజయం సాధించింది. వాస్తవానికి చిత్తూరు జిల్లాలో వైసీపీకి బలమైన నాయకుల బలం ఉంది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, మిథున్ రెడ్డి, రోజా, నారాయణ స్వామి వంటి బలమైన నాయకులు ఉన్నారు. అయితే అంతర్గత కుమ్ములాటలు, విభేదాలతో 2019, 2024 మధ్యా కాలంలో జిల్లాలో పార్టీ బలహీనపడటానికి వీరే కారకులయ్యారు. ముఖ్యంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధిపత్య ధోరణి కారణంగా పార్టీకి చెందిన జిల్లా నాయకులంతా ఆయనకు వ్యతిరేకంగా మారిపోయారు.ఇక 2024లో వైసీపీ ఘోర పరాజయాన్ని చవిచూసి.. కనీసం విపక్ష హోదాకు కూడా నోచుకోని దయనీయ స్థతికి పతనమయ్యాకా.. చిత్తూరులో వైసీపీ ఉనికి మాత్రంగా మిగిలిపోయిందని చెపవచ్చు. సరే ఇదంతా పక్కన పెట్టి విషయానికి వస్తే.. మద్యం కుంభకోణంలో ఇరుక్కుని మిథున్ రెడ్డి జైలు పాలైన తరువాత జిల్లాకు చెందిన నాయకులెవరూ ఇంత వరకూ ఆయనను కనీసం పరామర్శించను కూడా పరామర్శించలేదు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయన కోసం తండ్రి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నినా ఎవరూ వెళ్లి పరామర్శించి పలకరించిన పాపాన పోలేదు. ఒకప్పుడు మిథున్ రెడ్డికి రాఖీ కట్టిన రోజా కూడా ఆ తరువాత కాలంలో పెద్దిరెడ్డితో విభేదాల కారణంగా మిథున్ రెడ్డిని పరామర్శించే ఆలోచన కూడా చేయడం లేదంటారు. ఇక జిల్లాలో మరో బలమైన నాయకుడు చెవిరెడ్డి భాస్కరరెడ్డి కూడా మద్యం కుంభకోణంలో జైలు పాలైన సంగతి తెలిసిందే.



ఇక జిల్లాలోని ఇతర నాయకుల పరిస్థితి చూస్తుంటే.. ప్రస్తుతం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు, కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాలను చూసి లోలోన ఆనందిస్తున్నారా అన్నట్లుగా ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మిథున్ రెడ్డి అరెస్టునకు వ్యతిరేకంగా తొలి రోజులలో జరిగిన నామమాత్రపు నిరసనలు వినా.. వైసీపీ నేతలు, కార్యకర్తలు అసలాయనను పట్టించుకున్నట్లు కూడా కనిపించడం లేదు. ఇక మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి విషయానికి వస్తే ఆయన తాను ఎక్సైజ్ మంత్రిగా ఉన్న సమయంలో తనకు పూచిక పుల్ల పాటి విలువ కూడా ఇవ్వలేదన్న ఆక్రోశాన్నీ, ఆగ్రహాన్నీ బాహాటంగానే వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సిట్ ఆయనను విచారించినప్పుడు కూడా ఆయన మద్యం కుంభకోణం విషయంలో తనకు ఇసుమంతైనా సంబంధం లేదనీ, ఈ కుంభకోణం జరిగిన సమయంలో ఎక్సైజ్ మంత్రిగా ఉన్నప్పటికీ తనను పక్కన పెట్టి వ్యవహారమంతా పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డిలే నడిపారని చెప్పినట్లు గట్టిగా వినిపిస్తోంది. ఇక జిల్లాకే చెందిన మరో నాయకుడు భూమన కరుణాకరరెడ్డి విషయానికి వస్తే ఆయన తిరుపతి, టీటీడీ విషయాలు తప్ప మరేమీ పట్టించుకునే పరిస్థితులు లేవు. ఇక ఇప్పుడు పెద్దిరెడ్డి వర్గీయులు రోజా, భూమనల అరెస్టుల కోసం ఎదురు చూస్తున్నట్లు పార్టీ వర్గాల ద్వారానే తెలుస్తోంది. ఆడుదాం ఆంధ్ర కుంభకోణంలో మాజీ మంత్రి రోజా, టీడీఆర్ కుంభకోణంలో టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిలు త్వరలోనే అరెస్టు కాకతప్పదని వైసీపీ వర్గాలే చెబుతుండటం.. చిత్తూరు జిల్లాలో వైసీపీ ఎంతగా సంక్షోభంలో కూరుకుపోయిందో అర్ధమౌతుందని పరిశీలకులు అంటున్నారు. ఇక జగన్ విషయానికి వస్తే.. మద్యం కుంభకోణం తన మెడకు చుట్టుకుంటుందన్న ఆందోళనతో అసలు ఆ కుంభకోణంలో అరెస్టైన వారిని కనీసం పరామర్శించడానికి కూడా ఇష్టపడని పరిస్థితి కనిపిస్తోందంటున్నారు. ఎలా చూసినా వైసీపీ పెద్దిరెడ్డి ఫ్యామిలీని వదిలేసినట్లే కనిపిస్తోందని చెబుతున్నారు.

# యూరియా ఇవ్వలేని ప్రభుత్వాలు ఎందుకు?

హైదరాబాద్,గడిచిన కొన్నేళ్లుగా ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు. నాట్లు పూర్తిచేసి, యూరియా జల్లడం అనేది చాలా కామన్. ఈమధ్య కాలంలో యూరియా కొరత ఎప్పుడూ ఎదుర్కోలేదు రైతులు. కానీ ఈసారి యూరియాకు తీవ్ర కొరత ఏర్పడింది.కీలకమైన ఈ దశలో వరి పంటకు యూరియా చల్లకపోతే మొక్క పెరగదు. దాని ప్రభావం దిగుబడిపై కచ్చితంగా పడుతుంది. పైగా అటుఇటుగా మరో 3 వారాలు మాత్రమే టైమ్. ఈ టైమ్ లోనే యూరియా వేయాలి.కానీ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా యూరియా సరఫరా తగినంతగా లేదు. ఒక ఎకరాకు ఒక బస్తా మాత్రమే రేషన్ కింద ఇస్తున్నారు. ఆ ఒక్క బస్తా కోసం రైతులు పడిగాపులు పడుతున్నారు. పట్టా పాసు పుస్తకాలు, రేషన్ కార్డులు క్యూ లైన్లో పెట్టి వర్షాల్లో తడుస్తూ, ఎండకు ఎండుతూ ఎదురు చూస్తున్నారు.ఎకరాకు మించి వరి పండిస్తున్న ప్రతి రైతు దిగాలుగా ఉన్నాడు. ఒక ఆధార్ కార్డుపై ఒక బస్తా మాత్రమే అనే నిబంధన రైతుల్ని ఇబ్బంది పెడుతుంది. అదే బ్లాక్ మార్కెట్ కు వెళ్తే మాత్రం కావాల్సినన్ని బస్తాలు. కాకపోతే రేటు ఎక్కువ. రైతుకు మళ్లీ అదొక అదనపు భారం.మరోవైపు యూరియా బదులు, నానో యూరియా వాడమని చెబుతున్నాయి తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు. యూరియాను చేతితో జల్లితే సరిపోతుంది. నానో యూరియాను పిచికారీ చేయాల్సి ఉంటుంది. దీని వల్ల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని, ఎవ్వరూ పిచికారీకి ముందుకు రావడం లేదు. పైగా అలా పిచికారీ చేసినందుకు అదనంగా డబ్బు చెల్లించాల్సి వస్తోంది. ఎలాగైనా ఖర్చు తప్పడం లేదు.పిచికారీ కోసం ఉద్దేశించిన డ్రోన్స్ ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాలేదు. కనీసం ఖరీఫ్ నాటికి డ్రోన్స్ అందుబాటులోకి వచ్చినా, కొంతలో కొంత సాయపడేది. కానీ అవి కూడా అరకొరగానే ఉన్నాయి. పైగా తెలుగు రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో వాటిని కూడా బ్లాక్ చేసి పడేశారు.తెలంగాణల ఈ ఏడాది వరిసాగు పెరిగింది. ఈ నెల 10 లక్షల




మెట్రిక్ టన్నులకు పైగా యూరియా అవసరం. కానీ ఇప్పటివరకు వచ్చింది 6 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. ఏపీలో పరిస్థితి మరింత ఘోరం.మొత్తం ఖరీఫ్ సీజన్ కు 31 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. కానీ ఇప్పటివరకు 21.34 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయింది.రామగుండం ఫెర్టిలైజర్స్ పరిశ్రమ ఎప్పటికప్పుడు మొరాయించడం, నిర్వహణ సరిగ్గా లేకపోవడం, చైనా నుంచి దిగుమతి తగ్గడం, ఉన్న స్టాక్ బ్లాక్ మార్కెట్ కు తరలిపోవడం, నానో యూరియాను ఎక్కువగా అమ్మాలనే టార్గెట్ పెట్టుకోవడం లాంటి కారణాల వల్ల తెలుగు రాష్ట్రాల్లో యూరియాకు తీవ్ర కొరత ఏర్పడింది. ఈ ఏడాది దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వలేదు. చాలా చోట్ల వర్షాలు పడ్డాయి. సాగునీటికి ఢోకా లేదు. నారు కూడా బాగా పెరిగింది. అంతలోనే ప్రభుత్వాలు యూరియా అందనివ్వలేదు. కొన్ని చోట్ల కృత్రిమ కొరత సృష్టించారు. మరో నెల రోజుల్లో పొలాల్లో యూరియా చల్లకపోతే ఈ ఏడాది ఏపీ, తెలంగాణల వరి దిగుబడి అమాంతం పడిపోవడం ఖాయం. ఈ టెన్షన్ లో తెలుగు రాష్ట్రాల్లో ఏ రైతూ మనస్ఫూర్తిగా వినాయక చవితి పండగ జరుపుకోలేదు.

# హమ్ తుమ్ ఏక్.. కమలంమే.. బంధ్ హే!



హైదరాబాద్,రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతలను పరిశీలించేందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. అనుకోకుండా ఒకరికొకరు ఎదురయ్యారు. దీంతో ఇద్దరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. కాసేపు ముచ్చటించిన అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా వీరిద్దరు తెలంగాణ రాజకీయాల్లో ఉప్పు-నిప్పుగా ఉన్నా విషయం తెలిసిందే. ఈ లెక్కన బీజేపీ, బీఆర్ఎస్ మధ్య బంధం ఎట్టకేలకు ఉన్నట్టే ఎస్టాబ్లిష్ అయ్యిందా!? కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేననే బీజేపీ నేత బండి సంజయ్, బీజేపీ కాంగ్రెస్ ఒకటేనని కేటీఆర్.. కామెంట్ల వర్షం అంతా తుస్సేనా? ఈ ఇద్దరు ఎదురు పడ్డప్పుడు ఇలాంటి సన్నివేశం కనీసం ఊహించలేక పోయారు చాలా మంది. ఇంత సరదాగా ఒకరికొకరు పలకరించుకుని నవ్వుకోవడం ఏంటి? దీన్నెలా అర్ధం చేసుకోవాలి? చాలా మందికి అంతు చిక్కని ఫజిల్లా మారింది.గతంలో ఇదే బీఆర్ఎస్ బీజేపీలో విలీనం అనే అంశం మీద సీఎం రమేష్ అన్న మాటలకు ఇది తార్కాణమా? బీఆర్ఎస్ పై కాంగ్రెస్ ప్రభుత్వం పెడుతున్న కేసుల నుంచి తప్పించుకోడానికి బీఆర్ఎస్ ని బీజేపీలో కలిపేస్తారన్న మాట నిజమవుతుందనుకోవాలా? అని చూస్తే.. అంత వరకూ వస్తుందో రాదో తెలీదు కానీ కొంత వరకూ అయితే... ఒక ఎస్టాబ్లిష్మెంట్ చేయగలిగారు కేటీఆర్. అదెలాంటిదంటే, తమకు కేంద్ర బీజేపీ నాయకత్వం అండ పుష్కలంగా ఉంది. మీ కేసులు, కమిషన్ల బెదిరింపులకు భయపడం అన్న కోణంలో కొంత కేటీఆర్ ఈ దృశ్యం ద్వారా చెప్పాలని చూసినట్టుగా భావిస్తున్నారు.ఇదిలా ఉంటే, ఇలాంటి ఘటనలు సర్వసాధారణంగా జరుగుతూనే ఉంటాయి. మొన్నటికి మొన్న జగన్ ఎదురు పడ్డప్పుడు ఉండి ఎమ్మెల్యే, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు ఎంతో సరదాగా పలకరించారు. జగన్ పై తాను చాకిరేవు పెట్టి ఉతికి ఆరేసినదేదీ ఆయన పెద్దగా తీస్కోలేదు. ఇద్దరు కూడా రాజకీయాల్లో ఇవన్నీ సర్వ సాధారణం అన్న కోణంలో చేతులు కలుపుకుని వెళ్లిపోయారు.ఆ మాటకొస్తే అసెంబ్లీ లోపల గల్లా పట్టుకుని కొట్టుకుంటారేమో అన్న కోణంలో కనిపించే- అధికార ప్రతిపక్ష పార్టీల నాయకులు బయట కలసి జోకులేసుకుని హ్యాపీగా మాట్లాడుకుని వెళ్లిపోతుంటారు. అచ్చం సినిమా హీరోల్లా.. ఇక్కడ జనమే వారి పేరు చేప్పుకుని వీరు- వీరి పేరు చెప్పుకుని వారు తన్నుకులాడుకుంటారు. కానీ వాళ్లు వాళ్లు లోపల అలాయ్ బలాయే. రాజాసింగ్ కిషన్ రెడ్డి మీద చేసిన మెయిన్ కామెంట్ ఇదేగా? ఎవరు పవర్ లో ఉంటే కిషన్ వారితో కుమ్మక్కయ్యి కావల్సిన పనులు చేసుకుంటాడని. అలాంటి కామెంట్ చేసిన రాజాసింగ్ ప్రెజెంట్ బయట ఉన్నారు. అదే కిషన్ తాను పార్టీలో చక్రం తిప్పుతూనే ఉన్నారు. అదే ఏదైనా ఆల్ పార్టీ మీటింగుల్లాంటివి పెట్టినపుడు మాత్రం.. తనకు టైమే లేదన్నట్టు బిల్డప్ ఇచ్చి ఆపై బయట జనానికి తానొక నిఖార్సైన కమలం పార్టీ నాయకుడన్న కలరింగ్ ఇస్తుంటారని అంటారు రాజాసింగ్. ప్రస్తుతం బండి- కేటీఆర్ కలయిక అనే ఈ దృశ్యంలో స్పష్టంగా ఆ ఫేసుల్లో తొణికిసలాడిన ప్రేమాభిమానాలను బేరీజు వేస్తే.. ఒకరిపట్ల మరొకరికి ఉండాల్సిన దానికన్నా మించి ఏదో ఉంది అన్న ఇంటిమసీ అయితే బాగా కనిపిస్తోందని అంటున్నారు కొందరు. మరి చూడాలి దీనిపై కాంగ్రెస్ లీడర్ల రియాక్షన్ ఎలా ఉంటుందో తెలియాల్సి ఉంది.

# 75 ఏళ్ల రిటైర్మెంట్‌పై మోహన్ భాగవత్ సంచలన వ్యాఖ్యలు




న్యూఢిల్లీ,దేశంలో ప్రస్తుతం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లో ఉన్న నాయకులు 75 ఏళ్లకు పదవీ విరమణ చేయాలన్న చర్చ తీవ్రంగా నడుస్తోంది. ముఖ్యంగా ప్రధాని మోడీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌పై చర్చ నడుస్తోంది.తాజాగా దీనిపై మోహన్ భాగవత్ క్లారిటీ ఇచ్చేశారు. తాను గానీ.. మరొకరు గానీ 75 ఏళ్లకు పదవీ విరమణ చేయాలని ఎప్పుడూ అనలేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం దాదాపు రెండున్నర గంటల పాటు ప్రశ్నోత్తరాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 75 ఏళ్ల పదవీ విరమణపై అడిగిన ప్రశ్నకు పై విధంగా స్పందించారు. సెప్టెంబర్‌లో మోడీ కంటే 6 రోజుల ముందు మోహన్ భాగవత్‌కు 75 ఏళ్లు నిండనున్నాయి.తనకు 80 ఏళ్లు నిండినా.. తాను కోరుకున్నా.. లేకపోయినా సంఘ్ కోరుకున్నంత కాలం పని చేస్తానని మోహన్ భాగవత్ వెల్లడించారు. ఆర్ఎస్ఎస్ కేవలం అయోధ్య రామమందిర ఉద్యమానికే మద్దతు తెలిపిందని.. కాశీ-మథుర ఆలయంతో సహా మరే ఆలయ ఉద్యమానికి మద్దతు ఇవ్వబోదని స్పష్టంచేశారు. మతాన్ని ఎంచుకునే స్వేచ్ఛ వ్యక్తులకు ఉంటుందని.. అయితే ప్రలోభాలు, బలవంతాలు ఉండకూడదన్నారు. అక్రమ వలసదారులకు ఉద్యోగాలు ఇవ్వకూడదని.. ముస్లింలతో సహా మనవారికి మాత్రమే ఇవ్వాలని తెలిపారు. బీజేపీకి సంబంధించిన ప్రతి విషయాన్నీ ఆర్ఎస్ఎస్ నిర్ణయిస్తుందన్న భావన పూర్తిగా వాస్తవ విరుద్ధమని భాగవత్ కొట్టిపారేశారు. మతపరమైన దాడుల్ని సంఘ్ సమర్థించదని.. ఇస్లాం ఉండకూడదన్నది హిందూ ఆలోచనా విధానమే కాదన్నారు. భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలు ఆందోళనకరమని.. అంతర్జాతీయ వాణిజ్యం అవసరమే కానీ ఒత్తిడి కింద స్నేహం సాధ్యం కాదని భాగవత్ క్లారిటీ ఇచ్చారు.ఇక 75 ఏళ్ల తర్వాత కూడా మోడీ ప్రధానమంత్రిగా కొనసాగుతారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా స్పష్టం చేశారు. బీజేపీ పని నియమాల్లో వయో పరిమితి లేదని క్లారిటీ ఇచ్చారు.

# అమెరికాకు షాక్.. రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లు పెంచనున్న భారత్..

న్యూఢిల్లీ, భారత్‌పై 50 శాతం టారిఫ్స్ విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. గతంలో 25 శాతం సుంకాలు విధించగా.. ఆ తర్వాత అదనంగా మరో 25 శాతం జరిమానా విధిస్తున్నట్లు ప్రకటించారు.రష్యా నుంచి భారత్ ముడి చమురు కొనుగోలు చేసుకొని ప్రయోజనాలు పొందుతోందని ఆరోపిస్తూ ట్రంప్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే రష్యా చమురును కొనుగోలు చేస్తున్నందుకు భారత్‌పై యూఎస్ విమర్శలు చేస్తున్నప్పటికీ.. ఇండియా కూడా కౌంటర్ ఎటాక్ చేస్తుంది. అమెరికా, యురోపియన్ యూనియన్ దేశాలు కూడా రష్యా నుంచి చాలా దిగుమతులు చేసుకుంటున్నాయని ఆరోపించింది. తాజాగా ట్రంప్ కి షాకిచ్చేలా ఓ సంచలన వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది.అయితే, అమెరికా ఆగడాలకు భయపడేది లేదని.. అందుకోసమే, రష్యా నుంచి భారత్ ముడి చమురు దిగుమతులు మరింత పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. సెప్టెంబర్‌లో ఈ దిగుమతులు 10 నుంచి 20 శాతం వరకు పెంచే అవకాశం ఉందని తెలుస్తుంది. అంటే




రోజుకు దాదాపు 3 లక్షల బ్యారెల్స్‌ను అదనంగా కొనుగోలు చేయాలని భారత్ ప్లాన్ వేసింది. ప్రస్తుతం భారత్.. రష్యా నుంచి 40 శాతం క్రూడ్ ఆయిల్‌ను మాత్రమే దిగుమతి చేసుకుంటోంది.. ఇందుకోసం రష్యా ఒక బ్యారెల్‌కు 2-3 డాలర్ల డిస్కౌంట్ కూడా అందజేస్తుంది.

# పీఠం కోసం తమ్ముళ్ళ పోటీ...

అమరావతి,తెలుగు దేశం పార్టీలో ఇపుడు సంస్థాగత ఎన్నికల హడావుడి సాగుతోంది. ఈ క్రమంలో విశాఖ అధ్యక్ష పదవి కోసం పోటీ ఎక్కువైంది. తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు సీనియర్లు ఈ పదవికి పోటీ పడుతున్నారు. విశాఖ టీడీపీ అధ్యక్ష పదవి అన్నది ప్రతిష్టాత్మకమైనదిగా ఉంది. దాంతో ఈ పదవి దక్కితే తమకు మంచి హోదా దక్కినట్లు అవుతుందని భావిస్తున్నారు.గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ రాక త్యాగమూర్తులుగా మారిన వారు ఈ పదవితో అయినా న్యాయం చేయాలని అధినాయకత్వాన్ని కోరుతున్నారు. ఈ కీలక పదవి కోసం ఎమ్మెల్యేలు కూడా తమ వారికి ఇప్పించుకునేందుకు చూస్తున్నారు విశాఖ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామక్రిష్ణబాబు బంధువు టీడీపీలో కార్పోరేటర్ గా ఫ్లోర్ లీడర్ గా చేసిన నేత తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు అని అంటున్నారు. గతంలో ప్రధాన కార్యదర్శిగా ఆయన పనిచేశారు. అందువల్ల ఈసారి అధ్యక్ష పదవి ఇస్తే సమర్ధంగా చేస్తానని చెబుతున్నారు.మైనారిటీ కోటాలో కొంతమంది ప్రయత్నం చేస్తున్నారు. అలాగే భీమిలీ ఎమ్మెల్యేగా ఉన్న గంటా శ్రీనివాసరావు నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తమ్ముళ్ళు ఈ పదవి కోసం పోటీ పడుతున్నారు. ఇందులో ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించి విఫలం అయిన వారు ఎమ్మెల్సీ పదవిని ఆశించిన వారు నామినేటెడ్ పదవులు దక్కని వారు కూడా ఈ పదవి దక్కితే



చాలు అని ఎదురుచూస్తున్నారు.విశాఖ దక్షిణం భీమిలీ తూర్పు నియోజకవర్గాల నుంచే ఎక్కువ మంది పోటీ పడుతున్నారు. ఇప్పటిదాకా ఈ పదవిని నిర్వహించిన వారు పెందుర్తిని చెందిన వారు కావడం విశేషం. అలాగే గతంలో గాజువాకకు విశాఖ దక్షిణానికి ఈ పదవి దక్కింది దాంతో ఈసారి భీమిలీకైనా లేక విశాఖ తూర్పుకైనా దక్కవచ్చు అని అంటున్నారు. అలా గంటా, వెలగపూడి నియోజకవర్గాలలో ఎవరిని ఈ పదవి వరిస్తుందో చూడాల్సి ఉంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com